ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కాకినాడ జిల్లా వార్తలు
గురువారం 2 జనవరి 2025 | 5





కాకినాడలోని ఓ దుకాణం వద్ద మద్యం అమ్మకాలు

జిల్లా అన్ని రంగాల్లో.. పురోభివృద్ధి సాధించాలి

» ప్రజలు కొత్త ఏడాదిలో సుఖ సంతోషాలతో ఆనందంగా ఉండాలి: కలెక్టర్



కాకినాడ ఆనంద నిలయం విద్యార్థులకు పూలు ఇచ్చి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్(కాకినాడ), జనవరి 1(ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరంలో కాకినాడ జిల్లా అందరి భాగస్వామ్యంతో అన్నిరంగాల్లో పురోభివృద్ధి సాధించి, దేశ, రాష్ట్ర అభివృద్ధిలో కీలక భూమిక పోషించాలని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ ఆకాంక్షించారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని కాకినాడ రంగరాయ వైద్య కళాశాలవద్ద ఉన్న ఆనంద నిలయం వసతి గృహం విద్యార్థులకు బుధవారం నోటు పుస్తకాలు, పండ్లు అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ప్రజలు నూతన సంవత్సరంలో సుఖసంతోషాలతో ఆనందంగా ఉండాలని ఆకాంక్షించారు. కొత్త ఆశయాలు, కొత్త అవకాశాలతో సరికొత్త ఆనందాలతో అందరి జీవితాలు వెల్లివిరియాలన్నారు. జిల్లాకు చెందిన ఉద్యోగ సంఘాల నాయకులు, రెవెన్యూ, పోలీసు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు పెద్దఎత్తున జిల్లా కలెక్టర్‌కు పేదవిద్యార్థులకు ఉపయోగపడే నోట్ పుస్తకాలు, టవల్స్, ఇతర కాస్మొటిక్స్ వస్తువులు, పుష్పగుచ్ఛాలు ఇచ్చి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో శాసనమండలి సభ్యులు కర్రిపద్మశ్రీ, కాకినాడ కమిషనర్ భావన, జేసీ రాహుల్‌మీనా, డీఆర్వో వెంకట్రావు, కాకినాడ, పెద్దాపురం ఆర్డీవోలు మల్లిబాబు, శ్రీరమణి, కలెక్టరేట్ ఏవో రామ్మోహన్‌రావు పాల్గొన్నారు.

అన్నవరంలో ఘనంగా వేడుకలు

అన్నవరం, జనవరి 1(ఆంధ్రజ్యోతి): అన్నవరం సత్యదేవుడి సన్నిధిలో బుధవారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. దేవస్థానం ఉద్యోగులు, పురోహితులు, అర్చకులు ఈవో వీర్ల సుబ్బారావుకు శుభాకాంక్షలు తెలుపుతూ పుష్పగుచ్ఛాలు అందజేశారు. చైర్మన్ బంగ్లాలో ఐవీ రోహిత్‌కు నాయకులు, ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు.



కలెక్టర్ షాన్‌మోహన్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తున్న జేసీ రాహుల్



అన్నవరం దేవస్థానంలో టీటీడీ మెంబర్, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ దంపతులు

కొత్త కిక్

» న్యూ ఇయర్‌కు జిల్లాలో తెగ తాగేసిన మందుబాబులు
» డిసెంబరు 31న ఒక్కరోజులో ఏకంగా రూ.12.50కోట్లు మందు ఉఫ్
» 15వేల ఐఎంఎల్ కేసులు, 7,600బీరు కేసులు ఊదేసిన వైనం
» 2023, డిసెంబరు 31న జిల్లాలో మద్యం విక్రయాలు రూ.7.37కోట్లు
» అప్పటితో పోల్చితే ఈసారి భారీగా పెరిగిపోయిన లిక్కర్ సేల్స్
» కూటమి ప్రభుత్వం వచ్చాక నాణ్యమైన బ్రాండ్లతో తెగ అమ్ముడైన మద్యం
» సంక్రాంతికి సైతం భారీగా స్టాకు లోడింగ్ చేస్తోన్న మద్యం దుకాణాలు
» ప్రభుత్వం మారాక ప్రైవేటు దుకాణాలు రావడంతో సేల్స్ కోసం తెగ పోటీ
» విక్రయాలపై జనవరి 1 నుంచి కమీషన్ పెరగడంతో వ్యాపారులకూ కిక్

జిల్లాలో మందుబాబులు రెచ్చిపోయారు. డిసెంబరు 31న రాత్రి పూనకాలు లోడింగ్ తరహాలు తెగ తాగేశారు. కొత్త సంవత్సరంలోకి అడుగుపెడుతున్న నేపథ్యంలో న్యూఇయర్ పేరుతో సీసాలకు సీసాలు ఎత్తేశారు. నచ్చిన బ్రాండ్లు వందల్లో ఊది పాడేశారు.. దీంతో జిల్లాలో మునుపెన్నడూ లేని విధంగా డిసెంబర్ 31న మద్యం విక్రయాలు భారీగా పెరిగిపోయాయి.

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

2023 డిసెంబర్ 31తో పోల్చితే అమాంతం పెరిగిపోయాయి. అసలే అయిదేళ్లపాటు గత వైసీపీ ప్రభుత్వ నాసి రకం బ్రాండ్లతో విసిగెత్తిపోయిన మందుబాబులు కూటమి ప్రభుత్వం వచ్చాక నాణ్యమైన మద్యం అన్ని రకాల బ్రాండ్లలో తక్కువ ధరకు దొరుకుతుండడంతో ఎడాపెడా తాగేశారు. దీంతో జిల్లాలో మంగళవారం రాత్రి న్యూఇయర్ పేరుతో మద్యం విక్రయాలు ఏకంగా రూ.12.50కోట్లు జరిగాయి. ఒకరకంగా ఇది భారీ రికార్డు. 2023 డిసెంబరు 31న జిల్లా వ్యాప్తంగా రూ.7.37కోట్ల మద్యం విక్ర యాలు జరగ్గా, ఇప్పుడు అంతకుమించి జరిగాయి. మరోపక్క సంక్రాంతి దగ్గరపడ్డంతో మద్యం దుకాణాలన్నీ భారీగా సరుకు కోసం మద్యం డిపోలకు అప్పుడే ఆర్డర్లు ఇస్తున్నాయి.

సీసాలకు సీసాలు..

జిల్లాలో న్యూఇయర్ వేడుకలు మంగళవారం అర్ధరాత్రి భారీగా జరిగాయి. ఎక్కడికక్కడ ప్రజలు రోడ్లపైకి వచ్చి కొత్త సంవత్సరం వేడుకలను భారీగా నిర్వహించారు. కేకేలు కోసి సందడి చేశారు. అటు మందుబాబులైతే తెగ రెచ్చిపోయారు. 2024కు వీడ్కోలు పలుకుతూ, 2025కు స్వాగతం పలుకూత ఆనందంతో కేరింతలు కొట్టారు. అదేసమయంలో న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ పేరుతో మద్యం తెగతాగేశారు. న్యూ ఇయర్ వేడుకలను ఈసారి అంచనాలకు మించి అన్ని వర్గాలు భారీగా నిర్వహించాయి. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత అడుగుపెడుతున్న కొత్త సంవత్సరం కావడంతో గత ప్రభుత్వ అరాచకాలకు ముగింపు పలికిన ఏడాది 2024 అనే భావనతో మందుబాబులు తెగ సెలబ్రేట్ చేసుకున్నారు. అరాచకాలు, అక్రమాలకు ఫుల్‌స్టాప్ పెట్టిన సంవత్సరం అనే సంతోషంతో దొరికినకాడికి మద్యం తెగతాగేశారు. దీంతో జిల్లావ్యాప్తంగా మద్యం విక్రయాలు భారీగా జరిగాయి. జిల్లాలోని 155 ప్రైవేటు మద్యం దుకాణాలు, 20బార్లలో కలిపి ఒక్క రోజులో ఏకంగా డిసెంబర్ 31న జిల్లాలో మద్యం విక్రయాలు రూ.12.50 కోట్లు జరిగాయి. ఇందులో ఐఎంఎల్ మద్యం 15వేల కేసులు, బీరు కేసులు 7,600 వరకు అమ్ముడయ్యాయి. దీంతో విక్రయాలు భారీగా పెరిగాయి. వాస్తవానికి 2023 డిసెంబర్ 31న జిల్లాలో మద్యం విక్రయాలు రూ.7.37కోట్లు జరిగాయి. ఇందులో 5,263 ఐఎంఎల్ మద్యం, 3,532 కేసుల బీర్లు అమ్ముడయ్యాయి. అప్పటితో పోల్చితే ఈసారి సరుకు రెట్టింపు అమ్ముడైంది. మునుపటి ఏడాదితో పోల్చితే అమ్మకాలు భారీగా పెరిగిపోయాయి. అదే 2022, డిసెంబరు 31న జిల్లాలో మద్యం విక్రయాలు రూ.6.53 కోట్లు జరగ్గా 4,881 కేసుల ఐఎంఎల్, 3,344 కేసుల బీర్లు అమ్ముడయ్యాయి. అంటే గడచిన రెండు సంవత్సరాలతో పోల్చితే 2024 డిసెంబరు 31 విక్రయాలు అంచనాలకు మించి జరిగాయని అధికారులు చెబుతున్నారు.

వాస్తవానికి జిల్లాలో మందు బాబులకు గడచిన అయిదేళ్లు నరకంగా మారింది. మందు తాగాలని నోట్లో చుక్కే సుకుంటే దారుణమైన రుచి, వాసనతో మద్యం ప్రియులు తెగ ఇబ్బందులు పడ్డారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ దుకాణాలను రద్దుచేసి ప్రైవేటు మద్యం దుకాణాలకు అనుమతులు ఇచ్చింది. దీంతో జిల్లాలో 155 దుకాణాలు ఏర్పాటయ్యాయి.

నాణ్యమైన మద్యంతో..

నాసిరకం మద్యం స్థానంలో కూటమి ప్రభుత్వం నాణ్యమైన మద్యాన్ని దించింది. అడ్డగోలు ధరలను రద్దుచేసి తక్కువ ధరకు మద్యం అందుబాటులోకి తెచ్చింది. గత ప్రభుత్వంలో రూ.150వరకు విక్రయించిన చీప్‌లిక్కర్‌ను రూ.99కే మందుబాబులకు అందిస్తోంది. వైసీపీ మాయం చేసేసిన ప్రముఖ బ్రాండ్లను తిరిగి తేవడంతోపాటు విస్కీ బ్రాండ్లకు సంబంధించి 88రకాలు, బ్రాందీ సెగ్మెంట్‌లో 44, రమ్ము సెగ్మెంట్‌లో 8, వోడ్కాలో 8, వైన్ విభాగంలో 17, బ్రీజర్‌లో 4రకాలు, స్ట్రాంగ్ బీరులో 9 కంపెనీల చొప్పున వివిధ రకాల మద్యాన్ని అందుబాటులో ఉంచింది. దీంతో డిసెంబరు 31న మద్యం విక్రయాలు భారీగా పెరగడానికి కారణమైందని అధికారులు విశ్లేషించారు.

స్టాకు లోడింగ్..

సంక్రాంతి పండగ దగ్గర పడుతుండడంతో జిల్లాలో ప్రైవేటు మద్యం దుకాణాలు అప్రమత్తమయ్యాయి. పండగలో వారం పాటు మద్యం విక్రయాలు భారీగా ఉండనున్నందున అప్పుడే స్టాకులు సిద్ధం చేస్తున్నాయి. ఈ మేరకు డిపోలకు పెద్దఎత్తున ఆర్డర్లు ఇస్తున్నాయి. అటు మద్యం దుకాణాలకు ఇస్తోన్న కమీషన్‌ను కూటమి ప్రభుత్వం పెంచుతూ మంగళవారం రాత్రి ఆదేశాలు జారీచేసింది. ప్రస్తుతం ఇస్తున్న పదిశాతం కమీషన్‌ను 14శాతం చేసింది. దీంతో ఎంత వ్యాపారం పెరిగితే అంత లాభాలు అనే కోణంలో మద్యం దుకాణాలు సంక్రాంతి పండగకు సరుకు సిద్ధం చేస్తున్నాయి. గతేడాది సంక్రాంతికి జిల్లాలో రూ.22.42 కోట్ల మద్యం అమ్ముడైంది. భోగిరోజు రూ.7.78కోట్లు, సంక్రాంతికి రూ.7.51కోట్లు, కనుమ రోజు రూ.7.13కోట్లు చొప్పున మందుబాబులు తాగేశారు. ఈసారి నాణ్యమైన బ్రాండ్లతోపాటు ధరలు కూడా తక్కువగా ఉండడంతో సంక్రాంతి పండగ మద్యం విక్రయాలు రూ.50కోట్ల వరకు ఉండొచ్చని వ్యాపారులు అంచనా వేస్తున్నారు.

ఎస్పీకి ఎస్ఎస్పీగా పదోన్నతి



విక్రాంత్‌పాటిల్

కాకినాడ క్రైం, జనవరి 1(ఆంధ్రజ్యోతి): కాకినాడ ఎస్పీ విక్రాంత్‌పాటిల్ సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (ఎస్ఎస్పీ)గా పదోన్నతి పొందారు. ఈ మేరకు బుధవారం ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. విక్రాంత్‌పాటిల్ 2012 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందినవారు. ఆయన తొలుత విజయనగరం ఆపరేషన్స్ అడిషనల్ ఎస్పీగా పనిచేశారు. అనంతరం చిత్తూరు జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టారు. తదుపరి గుంతకల్ రైల్వే ఎస్పీగా పనిచేశారు. అనంతరం విజయవాడ సిటీకి డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (డీసీపీ)గా విధులు నిర్వర్తించారు. తదుపరి విజయనగరం ఏపీఎస్పీ 5వ బెటాలియన్ కమాండెంట్‌గా పనిచేసి పార్వతీపురం, మన్యం జిల్లా ఎస్పీగా విధులు నిర్వర్తించారు. 2024 జూలై 17న కాకినాడ జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్పీకి జిల్లాకు చెందిన పలువురు ఉన్నతాధికారులు అభినందనలు తెలిపారు.

రేషన్ డీలర్ల ఖాళీల భర్తీకి నోటిఫికేషన్

» 8వతేదీ వరకు దరఖాస్తులకు గడువు

కలెక్టరేట్(కాకినాడ), జనవరి 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఖాళీగా ఉన్న రేషన్ డీలర్ల పోస్టుల భర్తీకి కాకినాడ, పెద్దాపురం ఆర్డీవోలు మల్లిబాబు, శ్రీరమణి నోటిఫికేషన్ విడుదల చేశారు. కాకినాడ డివిజన్ పరిధిలో ఉన్న 96 పోస్టులకు, పెద్దాపురం డివిజన్ పరిధిలో ఉన్న 50 పోస్టులకు రాత పరీక్ష, ఇంటర్వ్యూ నిర్వహించనున్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈనెల 8న సాయంత్రం 5గంటల లోపు తమ దరఖాస్తులను ఆయా తహసీల్దార్ కార్యాలయంలోగానీ, ఆర్డీవో కార్యాలయాల్లో గానీ సమర్పించాలన్నారు.

స్టెల్లా నౌకలోకి కొనసాగుతున్న బియ్యం లోడింగ్

» ఇప్పటికి 48వేల మెట్రిక్ టన్నులు పూర్తి

కలెక్టరేట్(కాకినాడ), జనవరి 1(ఆంధ్రజ్యోతి): కాకినాడ సముద్రతీరంలో లంగరు వేసుకుని ఉన్న స్టెల్లా ఎల్ నౌకలోకి బియ్యం లోడింగ్ జరుగుతోంది. ఇప్పటి వరకు 48వేల మెట్రిక్ టన్నుల లోడింగ్ అయ్యింది. మరో 12వేల మెట్రిక్ టన్నుల బియ్యం లోడింగ్ కావాల్సి ఉంది. దీనికి మరో నాలుగురోజుల సమయం పట్టే అవకాశం ఉందని అధికారులు అంటున్నారు.

కాకినాడ ఎన్టీఆర్ బీచ్‌లో సముద్రంలోకి స్నానానికి దిగి ఇద్దరు విద్యార్థుల మృతి 7

కాకినాడ బీచ్‌కి పోటెత్తిన సందర్శకులు

సర్పవరం జంక్షన్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): కాకినాడ సూర్యారావుపేట బీచ్‌కు బుధవారం సందర్శకులు పోటెత్తారు. 2025, నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని వేలాది మంది సందర్శకులు ఎన్టీఆర్ బీచ్‌కు తరలివచ్చారు. ఈ సందర్భంగా చిన్నారులు సముద్ర ఒడ్డును ఆటపాటలతో సందడి చేశారు. యువత, పెద్దలు సముద్రస్నానాలు చేస్తూ ఎంజాయ్ చేశారు. బీచ్ సందర్శకుల రద్దీ తీవ్రంగా ఉండడంతో కాకినాడ లైట్‌హౌస్ నుంచి నేమాం వరకు బీచ్ 5కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించిపోయింది. దీంతో ఉప్పాడ నుంచి బీచ్‌రోడ్డు మీదుగా కాకినాడకు రాకపోకలు సాగించి వాహనాలు ఎక్కడికక్కడే రోడ్డుపై నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇక్కట్లకు గురయ్యారు. దీంతో తిమ్మాపురం ఎస్ఐ ఎంవీవీ రవీంద్రబాబు, మెరైన్ సీఐ రామోహ్మన్‌రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. వాహనాలు ప్రత్యామ్నాయ మార్గంలో వెళ్లేలా చర్యలు తీసుకున్నారు.

లైట్‌హౌస్ నుంచి నేమాం వరకు స్తంభించిన ట్రాఫిక్



బీచ్ రోడ్డులో నిలిచిపోయిన ట్రాఫిక్



కాకినాడ బీచ్‌లో కేరింతలు కొడుతూ ఆడుతున్న చిన్నారులు, యువత

వినోదంలో...విషాదం

నూతన సంవత్సరం వేళ
ఎన్టీఆర్ బీచ్‌లో బాధాకరమైన ఘటనలు
సముద్రంలోకి స్నానానికి దిగిన విద్యార్థుల మృతి
రెండు వేర్వేరు సంఘటనల్లో ఇద్దరు
ఇంటర్ విద్యార్థుల మరణం, మరొకరు గల్లంతు

సర్పవరం జంక్షన్ (కాకినాడ), జనవరి 1 (ఆంధ్రజ్యోతి): పర్యాటక విహార కేంద్రంగా ప్రసిద్ధి చెందిన కాకినాడ ఎన్టీఆర్ బీచ్ సందర్శకులకు ఆహ్లాదాన్ని పంచుతూనే... మరోవైపు ఆహ్లాదం మాటున ప్రమాదం పొంచి ఉన్న కడలి మృత్యు కెరటాలకు యువకులు బలవుతున్నారు. కొత్త సంవత్సరం వేళ స్నేహితులతో కలసి ఆనందోత్సాహాలతో బీచ్‌కు వచ్చిన యువకులు సముద్ర స్నానానికి దిగి కెరటాల ఉధృతికి గల్లంతైన 2 వేర్వేరు సంఘటనల్లో ఇద్దరు ఇంటర్ విద్యార్థులు మృతి చెందగా, మరొక యువకుడు గల్లంతైన సంఘటన ఎన్టీఆర్ ఓల్డ్ బీచ్‌లో బుధవారం సాయంత్రం జరిగాయి. వివరాల్లో కెళితే కొత్తపల్లి మండలం కోనపాపపేట శివారు మల్లివారితోటకు చెందిన గుత్తుర్తి సతీష్‌కుమార్ (17) కాకినాడ ఆదిత్య జూనియర్ కాలేజీలో హాస్టల్లో ఉంటూ ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యనభ్యసిస్తున్నాడు. కొత్త సంవత్సరం కావడంతో కాలేజీ నుంచి విహార యాత్ర (ఔటింగ్)కి వెళ్లేందుకు కాలేజీ అనుమతి ఇచ్చింది. దాంతో విద్యార్థులతో కలసి బుధవారం కాకినాడ రూరల్ మండలం సూర్యారావుపేట ఎన్టీఆర్ బీచ్‌కు వచ్చారు. అక్కడ కాసేపు ఆనందంగా గడిపిన తర్వాత ఓల్డ్ ఎన్టీఆర్ బీచ్‌లో సముద్ర స్నానాలు చేసేందుకు దిగారు. సముద్ర కెరటాల ఉధృతికి సతీష్‌కుమార్ గల్లంతయ్యాడు. అనంతరం మృతదేహం ఒడ్డుకు కొట్టుకు వచ్చింది.


ఎన్టీఆర్ బీచ్‌లో మృతిచెందిన పీఆర్ కాలేజ్ విద్యార్థి నాగసాయి

మరో సంఘటనలో...కాకినాడ రామకృష్ణారావుపేట ఎర్రరోడ్డుకు చెందిన వడిసెల గౌరీ లక్ష్మీ నాగసాయి (16), బొర్ర శ్రీనుబాబు మరో ముగ్గురు మొత్తం ఐదుగురు స్నేహితులతో కలసి సూర్యారావుపేట బీచ్‌కు వచ్చారు. అక్కడ కాసేపు ఆనందంగా గడిపిన తర్వాత సముద్రంలో స్నానానికి దిగారు. లక్ష్మీనాగసాయి, బొర్రా శ్రీనుబాబులు కెరటాల్లో పడగా లక్ష్మీనాగసాయి మృతిచెందాడు. మృతుడు కాకినాడ పీఆర్ కాలేజీలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. శ్రీనుబాబు సముద్రంలో గల్లంతయ్యాడు. ఈ విషయాన్ని స్నేహితులు వారి కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం అందించగా తిమ్మాపురం ఎస్ఐ ఎంవీవీ రవీంద్ర బాబు సిబ్బందితో కలసి సంఘటనా స్థలానికి చేరుకుని రెండు మృతదేహాలను పోస్టుమార్టమ్ కోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. గల్లంతైన యువకుడి కోసం మత్స్యకారులతో గాలింపు చేపట్టినట్టు ఎస్ఐ తెలిపారు. రెండు వేర్వేరు ఘటనల్లో ఇద్దరు విద్యార్థులు మృతిచెందగా, ఒకరు గల్లంతయ్యారన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. తమ కుమారుడు ఔటింగ్‌కి వెళ్లినట్లు కాలేజీ సిబ్బంది ఉదయం ఫోన్ చేసి చెప్పారని, తర్వాత సాయంత్రం 4.30 గంటలకు చనిపోయినట్లు సమాచారం చెప్పారని సతీష్‌కుమార్ తండ్రి లక్ష్మీనారాయణ కన్నీరుమున్నీరుగా విలపించాడు. తన సమ్మతి తీసుకోకుండానే ఔటింగ్‌కు పంపించారని ఆరోపించారు. తమకు సమాచారం ఇవ్వకుండా కుమారుడు మృతదేహాన్ని మార్చురీకి తరలించినందుకు వ్యతిరేకంగా కాలేజీ వద్ద కుటుంబ సభ్యులతో ధర్నా నిర్వహించారు. ఈ విషయమై తమకు న్యాయం చేయాలని ఆందోళన చేశారు.


మరణించిన సతీష్‌కుమార్ (ఫైల్)


గల్లంతు అయిన శ్రీనుబాబు (ఫైల్)

వేటకు వెళ్లి మత్స్యకారుడి గల్లంతు

పి.గన్నవరం, జనవరి 1(ఆంధ్రజ్యోతి): వేటకు వెళ్లి గోదావరిలో మత్స్యకారుడు గల్లంతైన విషాదఘటన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం వై.కొత్తపల్లి లో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వై.కొత్తపల్లికి చెందిన శేరు వీరకనక రాజు(40) అదే గ్రామానికి చెందిన మరో 15మందితో కలిసి కె.ఏనుగుపల్లి గోదావరిలోకి కొయ్యింగల పైలు వేటకు వెళ్లాడు. ఈ క్రమంలో గోదావరిలో వల మోడుకు చిక్కిపడడంతో తీసే క్రమంలో ప్రమాదవశాత్తు వీరకనకరాజు నీటిలో గల్లంతయ్యాడు. దీంతో తోటి మత్స్యకారులు ప్రయత్నించిన ఫలితం లేకుండా పోయింది. వీరకనకరాజు ఆచూకీ కోసం మత్స్యకారులు వలలు సాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. అతడికి భార్య వెంకటరమణ, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. భర్త గోదావరిలో గల్లంతు కావడంతో భార్యతో పాటు కుమారులు గోదావరి ఒడ్డున రోదిస్తున్న తీరు చూపరులను కంటతడి పెట్టించింది. ప్రమాద సమాచారాన్ని స్థానికులు, కుటుంబ సభ్యులు రెవెన్యూ, పోలీసు అధికారులకు తెలియజేశారు.


కె.ఏనుగుపల్లిలో రోదిస్తున్న వీరకనకరాజు భార్య, కుమారులు


వీరకనకరాజు (ఫైల్)

భర్త పెట్టే హింసలు భరించలేక..

నూతన సంవత్సరం రోజున
వివాహిత ఆత్మహత్య

గోకవరం, జనవరి 1(ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరం రోజున వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటనపై బుధవారం గోకవరం పోలీస్ స్టేషన్ లో కేసు నమోదైంది. ఎస్ఐ పవన్‌కుమార్ కథనం ప్రకారం.. పోలీస్ స్టేషన్ వెనుక వీధికి చెందిన షేక్ మీరా సాహెబ్, గండేపల్లి అనూష(24) సుమారు 8ఏళ్ల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. వారికి ఇద్దరు పిల్లలు సంతానం. గత కొద్దిరోజులుగా అనుమానంతో మీరాసాహెబ్ అనూషను వేధింపులకు గురి చేస్తున్నాడు. ఈ క్రమంలో భర్త పెట్టే హింసలు భరించలేక అనూష బుధవారం ఇంట్లో చీరతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలు తండ్రి వీరబాబు ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్టు, మీరా సాహెబ్ పరారీలో ఉన్నట్టు ఎస్ఐ చెప్పారు.


అనూష (ఫైల్)

హత్యా లేక ఆత్మహత్యా?

జార్జిపేటలో వ్యక్తి అనుమానాస్పద మృతి

తాళ్లరేవు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం జార్జిపేట గ్రామంలో కుడిపూడి మల్లికార్జునరావు (45) ఇంటి పిల్లరు ఊసలకు ఉరివేసుకుని మరణించడం ఆ ప్రాంతంలో సంచలనమైంది. వ్యాపార, ఆర్థిక లావాదేవీల నేపథ్యంలో ఇది హత్యా లేక ఆత్మహత్యా అని స్థానికులు అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. కోరింగ పోలీసుల వివరాల ప్రకారం.. జార్జిపేటలో కాకర్లపల్లి శ్రీనివాసరావు, నీలపల్లి గ్రామానికి చెందిన కుడిపూడి మల్లికార్జునరావు వాయిదా సామన్లు, సీట్లు ఫైనాన్స్ వ్యాపారం గత కొన్నేళ్లుగా ఉమ్మడిగా చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మల్లికార్జునరావుకు శ్రీనివాసరావు కొంతడబ్బు బకాయిప డ్డాడు. బకాయి డబ్బులు అడుగుతుంటే సరిగ్గా సమాధానం చెప్పకుండా దాటవేస్తూ తప్పించుకుంటూ తిరగడంతో ఇద్దరి మధ్య మనస్పర్థలు ఏర్పడ్డాయి. దీంతో మంగళవారం రాత్రి మల్లికార్జునరావు శ్రీనివాసరావు డాబా ఇళ్లపిల్లరు ఊసలకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న కోరింగ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలను సేకరించారు. శ్రీనివాసరావు పరారీలో ఉన్నాడు. మల్లికార్జునరావు మంగళవారం సాయంత్రం 6 గంటలకు కూరగాయలు తీసుకొచ్చి ఇచ్చేసి ఇంటి బయటకు వెళ్లాడని, ఎంతకీ రాకపోవడంతో రాత్రి 8గంటలకు ఫోన్‌చేయగా వచ్చేందుకు ఆలస్యం అవుతుందని అన్నాడని అతడి భార్య నాగదుర్గ చెప్పింది. నా భర్తను హత్య చేశారని ఆరోపించింది. కోరింగ ఎస్ఐ పి.సత్యనారాయణ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి అంబులెన్స్‌లో తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


ఉరి వేసుకున్న మల్లికార్జునరావు

ఇద్దరిని తీవ్రంగా గాయపర్చి... మహిళల పట్ల అమానుషంగా ప్రవర్తించి..

రాత్రి పూట బీభత్సం చేసిన ఏడుగురు
కేసు నమోదు చేసిన పోలీసులు

సీతానగరం, జనవరి 1(ఆంధ్రజ్యోతి): రాజంపేటలో దాడికి పాల్పడి ఇద్దరిని తీవ్రంగా గాయపర్చడమే కాకుండా మహిళల పట్ల అమానుషంగా ప్రవర్తించిన ఏడుగురిపై కేసు నమోదు చేసినట్టు సీతానగరం ఎస్ఐ డి.రామ్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం రాజంపేట బీసీ కాలనీలో డిసెంబర్ 31 రాత్రి ద్విచక్రవాహనంపై గుడ దుర్గాప్రసాద్ మరో వ్యక్తితో కలిసి వచ్చి నూతన సంవత్సర ముగ్గులు పెడుతున్న మహిళల వద్దకు వచ్చి బండి ఎక్సలేటర్ శబ్దం చేస్తూ మహిళలను కామెంట్ చేశాడు. అక్కడ ఉన్న దాసరి రాము అతడి బావమరిది మహిళలతో ఇలా ప్రవర్తించడం తప్పని వారించడంతో ఆగ్రహానికి గురైన గాడ దుర్గాప్రసాద్ ఫోన్ చేసి తన మిత్రులను పిలిచాడు. వారు వచ్చి చంపేస్తామని బెదిరిస్తూ రాళ్లు, కర్రలతో దాడి చేశారు. మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించి వారిపై చేతులు వేసి తాకకూడని చోట తాకి ఇబ్బంది కలిగిస్తూ బీభత్సం చేశారు. వారు చేసినదాడిలో దాసరి రాముతో పాటు అతడి బావమరిది అప్పలరాజు తీవ్రంగా గాయపడగా రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి వచ్చిన సమాచారం మేరకు దాడికి పాల్పడిన గాడ దుర్గాప్రసాద్‌తో పాటు గాడ వెంకటేష్, సిద్దు, హర్ష, జయసూర్య, వినయ్, మనోజ్, మరికొంతమందిపై హత్యాయత్నం కేసు నమోదు చేశామని ఎస్ఐ పేర్కొన్నారు.

ముక్క ఊడేలా భార్య బుగ్గను కొరికి...

పైశాచికత్వం ప్రదర్శించిన భర్త

గొల్లప్రోలు రూరల్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): ముక్క ఊడేలా భార్య బుగ్గను కొరికి భర్త పైశాచికత్వం ప్రదర్శించిన సంఘటన కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో జరిగింది. గ్రామానికి చెందిన దాసం నాగబాబు, శేషారత్నంకు వివాహమై నాలుగేళ్లు అయింది. వారికి పిల్లలు లేరు. ఈ నేపథ్యంలో ఇద్దరి మధ్య కొంతకాలంగా వివాదం జరుగుతోంది. ఈ విషయంపై నాగబాబు తన భార్యను మానసికంగా, శారీరకంగా హింసిస్తూ ఉండేవాడు. అంతేకాకుండా వేరే మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఈ విషయంపై మంగళవారం రాత్రి భార్యభర్తల మధ్య మరోమారు వాగ్వివాదం జరిగింది. దీంతో నాగబాబు తన భార్య శేషారత్నం మెడను కొరికి చంపాలని ప్రయత్నించాడు. సాధ్యం కాకపోవడంతో బుగ్గను మాంసం ముద్ద వచ్చేలా కొరికి దానిని ఊసివేశాడు. విషయం తెలుసుకున్న నాగమణి సోదరులు వచ్చి ఆమెను పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ వైద్యులు చికిత్స చేశారు. నాగమణి ఫిర్యాదుపై గొల్లప్రోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పిల్ల కాలువలోకి సిమెంట్ లారీ బోల్తా

తప్పిన ప్రమాదం

తుని రూరల్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని మండలం తేటగుంట సమీపంలో సిమెంట్ లారీ బోల్తా పడింది. విజయవాడ నుంచి ఒడిశాకు సిమెంట్ లోడుతో బయలుదేరిన ఓ లారీ తేటగుంటకు చేరుకునేసరికి రోడ్డుపక్కనే నిలిపివేసి ఉన్న ఒక వాహనం ఒకసారిగా రోడ్డుపైకి రావడంతో వెనకనుంచి వస్తున్న సిమెంట్ లారీ అదుపు తప్పి పక్కనే ఉన్న పిల్ల కాలువలో బోల్తా పడింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదమే తప్పిందని స్థానికులు తెలిపారు. తేటగుంట సెంటర్లో హోటల్ నిర్వాహకులు నిర్లక్ష్య ధోరణి కారణంగా వాహనదారులు అడ్డదిడ్డంగా నిలిపివేయడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, వీటి కట్టడికి పోలీసులు చొరవ తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.


తేటగుంట వద్ద అదుపు తప్పి బోల్తా పడిన సిమ్మెంటు లారీ

ఆలయాలకు 'నూతన' శోభ

సత్యదేవునికి ప్రముఖుల పూజలు


దర్శనానంతరం ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు దంపతులు


అన్నవరం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): కాకి నాడ జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో బుధవారం నూతన ఆంగ్ల సంవత్సరం పురస్కరించుకుని పలువురు ప్రముఖులు పూజలు నిర్వహించారు. ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు దంపతులు స్వామిని దర్శించుకున్నారు. జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ దంపతులు స్వామివారి వ్రతమాచరించారు. మాజీ మంత్రి, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ దంపతులు స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఆలయ ఈవో వీర్ల సుబ్బారావు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. స్వామి దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేశారు. మరోపక్క పలు ప్రాంతాల నుంచి స్వామి దర్శనానికి భక్తులు విచ్చేశారు. ప్రత్యేక దర్శనానికి 2 గంటలు, ఉచిత దర్శనానికి 3 గంటల సమయం భక్తులు వేచి ఉన్నారు. సుమారు 40 వేలమంది స్వామిని దర్శించుకున్నారు.


ఆలయంలో ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ

వాడపల్లికి పోటెత్తిన భక్తజనం

రూ.5.87లక్షల ఆదాయం

ఆత్రేయపురం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం నూతన సంవత్సర వేళ భక్తజనంతో కిటకిటలాడింది. బుధవారం వేకువజామునే స్వామివారికి గోదావరి జలాలతో అభిషేకం, తిరుప్పావై సేవా కాలం నిర్వహించి భక్తులకు దర్శనాలకు అనుమతించారు. నూతన సంవత్సరానికి స్వాగతం చెబుతూ ఫలపుష్పాలతో అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. స్వామివార్ల ఫోటోలను ఏర్పాటు చేసిన ఫోటోషూట్ వద్ద భక్తుల సందడి కనిపించింది. అశేష భక్తజనం స్వామివారిని దర్శంచుకుని అన్నప్రసాదం స్వీకరించారు. ఏడువారాల నోము ఆచరించిన భక్తులు స్వామివారికి అష్టోత్తర పూజలు నిర్వహించుకుని మొక్కులు తీర్చుకున్నారు. వివిధ సేవల ద్వారా రూ.5,87,238 ఆదాయం లభించినట్టు ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.





వాడపల్లి వెంకన్న ఆలయంలో పోటెత్తిన భక్తజనం, ఫలపుష్పాలతో అలంకరణ దృశ్యాలు

పాదగయకు భక్తుల తాకిడి


పాదగయలో అభిషేకం నిర్వహిస్తున్న అర్చకుడు

పిఠాపురం, జనవరి 1(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలో పాదగయ క్షేత్రానికి బుధవారం భక్తుల తాకిడి అధికంగా ఉంది. పాదగయలోని కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహూతికాఅమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు. దర్శనాలకు భక్తులు బారులు తీరారు. తిరుమల తిరుపతి దేవస్థానం నిర్వహణలోని వేంకటేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. దేశంలోని పంచమాధవ క్షేత్రాల్లో ఒకటిగా విరాజిల్లుతున్న కుంతీమాధవస్వామి దేవస్థానంలో భక్తులు పూజలు చేశారు.

సిద్ధి వినాయకుని ఆదాయం రూ.4.49 లక్షలు

అయినవిల్లి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): అయినవిల్లి శ్రీసిద్ధివినాయకుడికి బుధవారం రూ.4,49,861 ఆదాయం వచ్చింది. అన్నప్రసాద విరాళం రూ.1,76,111. విరాళం 11,647తో మొత్తం ఆదాయం రూ.4,49,861 వచ్చినట్టు సహాయ కమిషనర్ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు.

రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ రాకపోకలలో మార్పులు

సామర్లకోట, జనవరి 1 (ఆంధ్ర జ్యోతి): విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలో వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగించే పలు ఎక్స్‌ప్రెస్ రైళ్ల సమయాలను మార్పులు చేస్తూ రైల్వే ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు. బుధవారం సామర్లకోట రైల్వే స్టేషన్ ఉన్నతాధికారులకు అందిన సమాచారాన్ని ఆంధ్రజ్యోతి బుధవారం రాత్రి సేకరించింది. బుధవారం నుంచే అమలులోకి తెచ్చిన ఈ సమయాలు ఇ లా ఉన్నాయి. రోజూ ఉదయం 6.15 గంటలకు విజయవాడ నుంచి విశాఖకు బయలుదేరే రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ బుధవారం నుంచి ఉదయం 6.00 గంటలకే బయలుదేరుతుంది. అంటే 15 నిముషాల ముందు బయలుదేరుతుంది. సామర్లకోటకు నిత్యం విజయవాడ నుంచి విశాఖకు అధికసంఖ్యలో ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నందున మారిన సమయాలను ప్రయాణికులు గుర్తించుకోవాలనితెలి పారు.

కుంభమేళాకు ప్రత్యేక రైళ్లు

కుంభమేళాకు ప్రయాణించే రైలు ప్రయాణికుల సౌకర్యార్థం విజయవాడ, సామర్లకోటల మీదుగా పలు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లను నడుపుతున్నట్టు రైల్వే పీఆర్వో కార్యాలయం నుంచి బుధవారం ఉత్తర్వులు అందాయి. 07107 నంబరు గల ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు తిరుపతి నుంచి బెనారస్‌కు ప్రత్యేక రైలు జనవరి 18, ఫిబ్రవరి 8,15,23 తేదీల్లో శనివారం రాత్రి 8.55 గంటలకు తిరుపతిలో బయలుదేరుతుంది. బెనారస్‌కు సోమవారం మధ్యాహ్నానికి అంటే 3.45 గంటలకు చేరుతుంది.

07108 నంబరు గల బెనారస్-తిరుపతి మధ్య తిరుగు ప్రయాణంలో జనవరి 20, ఫిబ్రవరి 10,17,24 తేదీల్లో బెనారస్‌లో మంగళవారం సాయంత్రం 5.30గంటలకు బయలుదేరుతుంది.

ఈ రైళ్లకు రాష్ట్రంలో గూడూరు, నెల్లూరు, ఒంగోలు, చీరాల, తెనాలి, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, నిడదవోలు, రాజమహేంద్రవరం, సామర్లకోట, అన్నవరం, యలమంచిలి, అనకాపల్లి, దువ్వాడ, పెం దుర్తి, కొత్తవలస, విజయనగరం, బొబ్బిలి, పార్వ తీపురం, రాయగడ, మునిగుడలలో హాల్ట్ ఉంది.

అదుపుతప్పి పొలాల్లోకి దూసుకుపోయిన ఆటోలు

తప్పిన ప్రమాదం
ఐదుగురికి స్వల్పగాయాలు

శంఖవరం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా శంఖవరం మండలంలోని గిరిజన గ్రామం శృంగధారలో బుధవారం రాత్రి జరిగిన ప్రమాదంలో ఐదుగురికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం బుధవారం రాత్రి పెదమల్లాపురం సమీపంలో శృంగధార వద్ద ఎదురెదురుగా వస్తున్న ఆటోలు అదుపుతప్పి పొలాల్లోకి దూసుకుపోయాయి. ఎటువంటి ప్రాణపాయం లేకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. గాయపడినవారిని ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. దీనిపై అన్నవరం పోలీస్ స్టేషనులో ఏ కేసు నమోదు కాలేదు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

పిఠాపురం, జనవరి 1(ఆంధ్రజ్యోతి): పిఠాపురంలోని రాజారామ్మోహనరాయ్ పార్కులో గుర్తు తెలియని వ్యక్తి మరణించాడు. కొంతకాలంగా అక్కడే ఉంటున్న అతడు మంగళవారం సాయంత్రం మరణించగా స్థానికులు పోలీసులు, మున్సిపల్ అధికారులకు సమాచారం ఇచ్చారు. బుధవారం సాయంత్రం మృతదేహం అక్కడే ఉండడంతో పా ర్కుకు వచ్చిన వారు ఇబ్బందులు పడ్డారు. కుటుంబ సభ్యుల సమాచారం తెలియకపోవడంతో ఎట్టకేలకు మున్సిపల్ సిబ్బంది వచ్చి మృతదేహాన్ని అంతిమ సంస్కారాలకు తరలించారు.


పార్కులో మరణించిన వ్యక్తి


నన్నయ విశ్వవిద్యాలయం క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ శ్రీనివాసరావు


'నన్నయ' అభివృద్ధికి సహకరించాలి

వీసీ శ్రీనివాసరావు

దివాన్‌చెరువు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరూ తమ పనిని త్రికరణశుద్ధిగా నిర్వహిస్తూ విశ్వవిద్యాలయ అభివృద్ధికి సహకరించాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య వై.శ్రీనివాసరావు అన్నారు. విశ్వవిద్యాలయం 2025 క్యాలెండర్‌ను బుధవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నూతన సంవత్సరంలో నన్నయ విశ్వవిద్యాలయ ప్రాంగణాలు, అనుబంధ కళాశాలల సిబ్బంది, విద్యార్థులంతా నూతన లక్ష్యాలను ఎంచుకుని సాకారం చేసేందుకు కృషి చేయాలన్నారు. కొత్త సంవత్సరంలో విద్య, ఉద్యోగాల్లో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం విశ్వవిద్యాలయంలోని అన్ని విభాగాలను వీసీ సందర్శించి అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో దేవగుప్తం సొసైటీ సీఈవో మృతి

అల్లవరం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): తాడికోన ఆక్వా చెరువుల వద్ద మంగళవారం రాత్రి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ షాక్‌తో దేవగుప్తం సహకార సొసైటీ సీఈవో కొల్లా దుర్గాప్రసాద్‌స్వామినాయుడు(40)మృతిచెందారు. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద నాయుడు మృతదేహాన్ని కనుగొని అమలాపురంలోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. అయితే అతను అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. స్వామినాయుడుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. స్వామినాయుడు మృతికి సంతాపంగా మండలంలోని 8 సహకార సంఘ కార్యాలయాలు మూసివేసి సంతాపం ప్రకటించారు. దేవగుప్తం సహకార సొసైటీ అధ్యక్షుడు జిన్నూరి రామారావు, డీసీసీబీ అల్లవరం బ్రాంచి బీఎం ప్రియదర్శిని, సీఈవో కొమ్మూరి సత్తిబాబు స్వామినాయుడు మృతి పట్ల ప్రగాఢ సంతాపం తెలిపారు. రొయ్యల చెరువు వద్ద విద్యుత్ కనెక్షన్ ఇస్తుండగా కొల్లా దుర్గాప్రసాద్ స్వామినాయుడు మృతి చెందాడని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ జి.హరీష్‌కుమార్ తెలిపారు.


స్వామినాయుడు (ఫైల్)

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

సందడే..సందడి!

• జిల్లాలో ఉత్సాహంగా నూతన సంవత్సర వేడుకలు • ప్రజాప్రతినిధులకు శుభాకాంక్షల వెల్లువ




సామర్లకోట: ఎమ్మెల్యే చినరాజప్పకు మొక్క అందిస్తున్న ఆర్డీవో, రాజప్పకు వేదాశీర్వచనం చేస్తున్న పండితులు




పెద్దాపురం: పులిమేరులో వేడుకల్లో తుమ్మల బాబు, చేబ్రోలులో మర్రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేస్తున్న దృశ్యం



సర్పవరం జంక్షన్: ఎమ్మెల్యే నానాజీకి శుభాకాంక్షలు తెలుపుతున్న అనంతలక్ష్మి సత్యనారాయణమూర్తి దంపతులు




కాకినాడలో కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, శుభాకాంక్షలు తెలుపుతున్న కమిషనర్ భావన

పిఠాపురం, జనవరి 1(ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరం ప్రవేశించిన వేళ సందడి వాతావరణం కనిపించింది. పిఠాపురం మున్సిపల్ కార్యాలయం ఎదురుగా గల పాత టీడీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొన్నారు. నాయకులు, కార్యకర్తల సమక్షంలో న్యూఇయర్ కేకులు కట్ చేశారు. పిఠాపురం, గొల్లప్రోలు, కొత్తపల్లి మండలాల ప్రజాప్రతినిధులు, అధికారులు, వివిధ సంఘాల ప్రతినిధులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు వర్మకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజాసేవకే జీవితాన్ని అంకితం చేస్తున్నట్టు వర్మ ప్రకటించారు. పట్టణంలోని మున్సిపల్ చైర్‌పర్సన్ గండేపల్లి సూర్యావతి బాబికి ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది, వైసీపీ నాయకులు శుభాకాంక్షలు తెలపారు. కాగా మాజీ ఎంపీ వంగా గీతావిశ్వనాథ్, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు నూతన సంవత్సర వేడుకలకు దూరంగా ఉన్నారు.

చేబ్రోలులో...

గొల్లప్రోలు రూరల్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): పిఠాపురాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసి దేశంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చిత్తశుద్ధితో పనిచేస్తున్నారని జనసేన పిఠాపురం ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు తెలిపారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని పవన్‌కల్యాణ్ నివాసంలో బుధవారం నిర్వహించిన నూతన సంవత్సర వేడుకల్లో మర్రెడ్డి పాల్గొన్నారు. నియోజకవర్గంలోని జనసేన నాయకులు, జనసైనికులు, వీరమహిళలు, ప్రజాప్రతినిధులు, వివిధశాఖల అధికారులు, సిబ్బంది, వివిధ సంఘాల ప్రతినిధులు మర్రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. మర్రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గ సమగ్రాభివృద్ధి లక్ష్యంగా పిఠాపురం ఏరియా డెవలప్‌మెంట్ అథారటీని ఏర్పాటు చేశారని, పిఠాపురంలో ఉన్న 30 పడకల ఆసుపత్రిని 100 పడకల ఏరియా ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేయించారని చెప్పారు. ప్రజలకు ఏ సమస్య, కష్టం వచ్చినా అండగా ఉంటామన్నారు.

పులిమేరులో...

పెద్దాపురం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): పట్టణ, మండల గ్రామాల్లో నూతన వేడుకలను బుధవారం ఉత్సాహంగా నిర్వహించుకున్నారు. పులిమేరు గ్రామంలో కుడా చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేసి నూతన సంవత్సరానికి ఆహ్వానం పలికారు. అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.. పలువురు ప్రముఖులు ఆయనను కలిసి నూతన శుభాకాంక్షలు తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీమంగతాయారు, మాజీ చైర్మన్ రాజాసూరిబాబురాజును పలువురు కలుసుకుని శుభాకాంక్షలు తెలియచేశారు.

గొడారిగుంటలో...

సర్పవరం జంక్షన్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): 2025 నూతన సంవత్సరంలో ప్రజలంతా పూర్తి ఆరోగ్యంగా సుఖసంతోషాలతో ఆనందంగా జీవించాలని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ ఆకాంక్షించారు. బుధవారం గొడారిగుంటలో ఎమ్మెల్యే నివాసానికి కాకినాడ రూరల్ నియోజకవర్గంతో పాటూ సిటీ, జిల్లా నలుమూలల నుంచి వేలాది మంది కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులు, పోలీసులు, ఎక్సైజ్ శాఖ అధికారులు తరలివచ్చి ఎమ్మెల్యే నానాజీకి పువ్వుల బొకేలు, గజమాలలతో సత్కరించి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. పార్టీ శ్రేణులతో కలసి కేక్ కట్ చేసి అందరికీ పంచారు. ఎమ్మెల్యే నానాజీకి మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మిసత్యనారాయణమూర్తి దంపతులు పూలబొకే ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. వలసపాకలలో టీడీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణమూర్తి, మాజీ ఎమ్మె ల్యే పిల్లి అనంతలక్ష్మిల ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. కొత్త గైగోలుపాడు లలితానగర్ లో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పెంకే శ్రీని వాస బాబా, రమణయ్యపేటలో టీడీపీ రాష్ట్ర కా ర్యదర్శి వాసిరెడ్డి ఏసుదాసు, కరణంగారి సెంటర్‌లో టీడీపీ కో కోఆర్డినేటర్ కటకంశెట్టి వెంకట ప్రభాకర్ (బాబీ), ఆర్టీవో కార్యాలయ రహదారిలో జేఎన్‌టీయూకే వెనకాల వీధిలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గుణ్ణం చంద్రభమౌళిల ఆధ్వర్యం లో వేడుకలు నిర్వహించారు. పార్టీ కార్యకర్తలు, నాయకుల నడుమ కేక్ కట్ చేసి పంచారు.

కొత్తపల్లిలో...

కొత్తపల్లి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): కొత్తపల్లిలో జనసేన నాయకుడు గవరం రాంబాబు, వాకతిప్పలో జీజీహెచ్ డవలప్‌మెంట్‌కమిటీ డైరెక్టర్ రావు అక్షయ్, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి రావు చిన్నారావు కార్యాలయాల్లో కేక్స్ కట్ చేసి బాణాసంచా కాల్చారు. వివిధ పాఠశాలల చిన్నారులు నాయకులకు గ్రీటింగ్స్ అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

అచ్చంపేటలో...

సామర్లకోట, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సర వేడుకలు బుధవారం సామర్లకోట మండలం అచ్చంపేటలోని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప స్వగృహంలో పలువురు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. రాజప్పను నాయకులు గజమాలలతో ముంచెత్తి అభినందించగా, ఉన్నతాధికారులు మొక్కలను అందించి శుభాకాంక్షలు తెలియజేసారు. పలువురు నాయకులు పెన్నులు, పుస్తకాలు తదితర విద్యాసామాగ్రిని రాజప్పకు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ముందుగా సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయం, పెద్దాపురం మరిడమ్మ అమ్మవారి ఆలయాల నుంచి వేదపండితులు ఎమ్మెల్యే చినరాజప్పకు వేదాశీర్వచనం పలికి శేషవస్త్రాలను అందజేసి ప్రసాదాలను అందజేసారు. ఈ సందర్భంగా వచ్చిన పెన్నులు, పుస్తకాలు, పెన్సిళ్ళను సామర్లకోట మున్సిపల్ పాఠశాలల విద్యార్థులకు అందజేసేలా మాజీ వైస్‌చైర్మన్ యార్లగడ్డ రవిచంద్ర ప్రసాద్(చిన్ని), కంటే జగదీష్‌మోహన్ (బాబు)లను ఎమ్మెల్యే అందజేశారు. డీఆర్‌డీప ప్రాజెక్ట్ డైరక్టర్, పెద్దాపురం ఆర్డీవో శ్రీరమణి, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరక్టర్ కె.ప్రవీణ, సీడీపీవో ఉషా, ఉమా, నిర్మలాకుమారి, ఎంఈవోలు శివరామకృష్ణయ్య, పట్టపగలు పుల్లయ్య, పూలమొక్కలందించి శుభాకాంక్షలు తెలియజేసారు. కార్యక్రమంలో నిమ్మకాయల రంగనాగ్, నిమ్మకాయల జగ్గయ్యనాయుడు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపు మత్స్యకారులకు పరిహారం పంపిణీ

తాళ్లరేవు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): ఈనెల 3న కోరింగ 216 జాతీయ రహదారి పక్కన బహిరంగ సభలో 2 జిల్లాలు, 5 నియోజకవర్గాలు, 8మండాలకు చెందిన 69 మత్యకారగ్రామాలకు చెందిన 23,458మంది లబ్ధిదారులకు రూ.148 కోట్లు ఓఎన్‌జీసీ నష్ట పరిహారం పంపిణీ జరుగుతుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు బుధవారం తెలిపారు. మత్స్యకారులంతా బహిరంగసభకు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పిఠాపురం, జనవరి 1(ఆంధ్రజ్యోతి): పిఠాపురం పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల్లో ఈనెల 3న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ పెద్దాపురం ఈఈ ప్రభాకర్, ఏపీ ట్రాన్స్‌కో ఈఈ ఖాజా రహంతుల్లాలు తెలిపారు. రాయవరం-పిఠాపురం మధ్య గల 132కేవీ లైను మార్పు చేయడంలో భాగంగా పిఠాపురం పట్టణం, టిడ్కో అపార్ట్‌మెంట్లు, జగ్గయ్యచెరువు కాలనీ, రాపర్తి, వాటర్‌వర్క్స్, గంగానగర్, నరసింగపురం, జములపల్లి, కోలంక, గోకివాడ, జగపతి రాజపురం తదితర ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9నుంచి మధ్యాహ్నం 3గంటల మధ్య సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

కాకినాడ రూరల్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): యంగ్ మైండ్స్ రేపటి కోసం స్వచ్ఛంద సంస్థ నూతన క్యాలెండర్‌ను జిల్లా విద్యాశాఖాధికారి పిల్లి రమేష్ బుధవారం తన ఛాంబర్‌లో ఆవిష్కరించారు. డీఈవో మాట్లాడుతూ యంగ్ మైండ్స్ సంస్థ విద్యావ్యాప్తికి ఎంతో కృషి చేస్తున్నదన్నారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు వాకాడ వెంకటరమణ, సభ్యులు నూకరాజు, సాయి రామకృష్ణ, బాపిరాజు, సత్యనారాయణ, ఆది మూర్తి ఉన్నారు.



రెవెన్యూ అసోసియేషన్ డైరీ ఆవిష్కరణ



కలెక్టరేట్(కాకినాడ), జనవరి 1(ఆంధ్రజ్యోతి): ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ కాకినాడ జిల్లా అధ్యక్షుడు పితాని త్రినాథ్, కార్యదర్శి రామ్మోహన్‌రావు, అసోసియేట్ ప్రెసిడెంట్ చంద్రశేఖరరెడ్డి, కలెక్టరేట్ యూనిట్ ప్రెసిడెంట్ శివ, వైస్ ప్రెసిడెంట్ సంధ్య కాకినాడ డివిజన్ యూనిట్ ప్రెసిడెంట్ సూరిబాబు కలెక్టర్ షాన్‌మోహన్‌ను కలిసి 2025 నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలి పారు. అనంతరం రెవెన్యూ డైరీ, క్యాలెం డర్‌ను ఆవిష్కరించారు. ఏపీజేఏసీ అమరావతి జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గాప్రసాద్, సభ్య సంఘాల ప్రతినిధులు శుభాకాంక్షలు తెలియజేశారు.

డింకీ కోడిపందేలు ఆడిన వర్మ

పిఠాపురం, జనవరి 1(ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సర వేళ పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ కోడిపందేలు ఆడారు. పురాతన కాలం నుంచి వస్తున్న సంప్రదాయాలను గౌరవించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదురుగా గల పాత టీడీపీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన నూతన సంవత్సర వేడుకల్లో వర్మ పాల్గొన్నారు. భారీగా తరలివచ్చిన నాయకులు, కార్యకర్తల్లో కొందరు పందెంకోళ్లను తీసుకువచ్చారు. సంక్రాంతి సంప్రదాయాలను గౌరవిస్తూ డింకీ కోడిపందాలు ఆడాలని వర్మను కోరారు. వర్మ మాట్లాడుతూ పురాతన కాలం నుంచి వస్తున్న సంస్కృతి, సంప్రదాయాలకు అనుగుణంగా సంక్రాంతి పండుగ వేళ కోడిపందేలు ఆడటం, వీధి నాటకాలు వేయడం జరుగుతున్నదన్నారు. ఈసారి పంటలు సుభిక్షంగా పండటంతో రైతులు ఆనందంగా పండుగ జరుపుకోనున్నారని, ఇటువంటి సందర్భంలో అన్ని సంప్రదాయాలను గౌరవించాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలిపారు. కోడికాళ్లకు కత్తులు కట్టి పందాలు ఆడటం చట్టానికి వ్యతిరేకమని, అటువంటి వాటిని ప్రోత్సహించవద్దని సూచించారు. సంక్రాంతికి అన్ని సంప్రదాయాలు ఉంటాయని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం వీటిని గౌరవిస్తుందని వర్మ స్పష్టం చేశారు.



పిఠాపురంలో పందెం కోళ్లతో మాజీ ఎమ్మెల్యే వర్మ

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

పీఠాధిపతి డాక్టర్ ఉమర్‌ఆలీషా

పిఠాపురం, జనవరి 1(ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మికతతోనే మానవునికి మానసిక ప్రశాంతత చేకూరుతుందని విశ్వవిజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠాధిపతి డాక్టర్ ఉమర్‌ఆలీషా తెలిపారు. పిఠాపురం పట్టణ శివారులోని విశ్వవిజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠం నూతన ఆశ్రమ ప్రాంగణంలో నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని బుధవారం నిర్వహించిన ఆధ్యాత్మిక సభలో ఆయన భక్తులనుద్దేశించి అనుగ్రహభాషణ చేశారు. మానవునిలోని జీవాత్మ, పరమాత్మను దర్శించాలంటే జ్ఞాననేత్రం అవసరమన్నారు. మానవత్వమే ఈశ్వరతత్వమని ప్రతీ ఒక్కరూ గ్రహించాలని సూచించారు. మానవశాంతి కోసం, ప్రతి ఒక్కరిలో మానవత్వపు విలువలు వికసింప చేయడానికి పీఠం కృషి చేస్తుందని తెలిపారు. ఉమర్‌ఆలీషా రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు ద్వారా కుట్టుమిషన్లు అందజేశారు. జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ ఎస్.రామగోపాల్‌వర్మ డ్రోన్‌పైలట్ శిక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో అహ్మద్‌ఆలీషా, పీఠం కన్వీనర్ పేరూరి సూరిబాబు, ఆకుల రవితేజ, ఎస్‌టీవీ ప్రసాద వర్మ, ఏవీవీ సత్యనారాయణ, డాక్టర్ పింగళి ఆనందకుమార్ తదితరులు పాల్గొన్నారు.



కుట్టుమిషన్ అందజేస్తున్న పీఠాధిపతి డాక్టర్ ఉమర్‌ఆలీషా

బీచ్‌లో కొత్త సంవత్సరం సందడి

● ట్రాఫిక్‌కు అంతరాయం



ఉప్పాడ బీచ్‌రోడ్డు సెంటర్లో పహారా కాస్తున్న కొత్తపల్లి పోలీసులు

కొత్తపల్లి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): నూతన ఆంగ్ల సంవత్సర వేడుకల సందర్భంగా బుధవారం ఉప్పాడ బీచ్ పర్యాటకులతో సందడినెలకొంది. కొత్తపల్లి మండలంలో వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు కాకినాడ నుంచి సూర్యారావు, నేమాం మీదుగా ఉప్పాడ తీరానికి చేరారు. దీంతో పర్యాటకులతో బీచ్‌రోడ్డు రద్దీగా మారింది. కొత్తపల్లి పోలీసులు ఉప్పాడ నుంచి బీచ్ రోడ్డు మీదుగా కాకినాడ వెళ్లే వాహనాల రాకపోకలను నియంత్రించారు.

భీమేశ్వరాలయంలో విశేష పూజలు




సామర్లకోట, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): పంచారామ పుణ్య క్షేత్రమైన సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలో నూతన సంవత్సరం పురస్కరించు కుని బుధవారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బళ్ళ నీలకంఠం ఆధ్వర్యంలో వేదపండితులు సోమేశ్వరశర్మ, చెరుకూరి రాంబాబు, రాజశేఖరశర్మ, అంజి బాబు, వెంకన్న తదితరుల వేద మంత్రోచ్చారణల మధ్య స్వామివారికి విశేష అభిషేక పూజలు నిర్వహించారు. పుష్పార్చన పూజలు చేశారు. అమ్మవారికి విశేష కుంకుమార్చన పూజలు చేశారు. పూజల స్వామిఅమ్మవార్లను నూతన పట్టు వస్త్రాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. జిల్లా నలుమూలల నుంచీ అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం ప్రసాదాలు స్వీకరించారు. నిత్యాన్నదాన పథకంలో 600మంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

రేషన్ డీలర్ల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

పెద్దాపురం, జనవరి 1(ఆంధ్రజ్యోతి): పెద్దాపురం డివిజన్ పరిధిలోని పలు కారణాలతో ఏర్పడిన ఖాళీ అయిన రేషన్ డీలర్ల నియామకాన్ని చేపట్టనున్న ఆర్డీవో కె.శ్రీరమణి తెలిపారు. డీలర్ల నియామకానికి సంబంధించి నోటిఫికేషన్‌ను బుధవారం జారీ చేశారు. డీలర్ల ఎంపిక రాత పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా చేపట్టనున్నట్లు తెలిపారు. దరఖాస్తు నమూనా కోసం తహశీల్దార్, ఆర్డీవో కార్యాలయాల్లో సంప్రదించాలని ఆమె కోరారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈనెల 8వతేదీ సాయంత్రం ఐదు గంటల్లోగా తహశీల్దార్, ఆర్డీవో కార్యాలయాల్లో దరఖాస్తులను అందించాలన్నారు. డివిజన్ పరిధిలోని గండేపల్లి మండలం మురారి, సింగరంపాలెం, సూరంపాలెం, నాయకంపల్లి, మల్లేపల్లి, నీలాద్రిరావుపేట, జగ్గంపేట మండలం రామవరం, కిర్లంపూడి మండల పరిధిలో కిర్లంపూడి (2), వీరవరం, రామచంద్రాపురం, కోటనందూరు మండలం టీజే నగరం, బంగారయ్యపేట, కేఏస్ కొత్తూరు, కోటనందూరు, పెద్దాపురం మండల పరిధిలో పెద్దాపురం (2), ఉలిమేశ్వరం, తూర్పుపాకలు, దివిలి (2), తాటిపర్తి, వాలుతిమ్మాపురం, ప్రత్తిపాడు మండల పరిధిలో ప్రత్తిపాడు, పోతులూరు, యూజే పురం, వెంకట నగరం, రౌతులపూడి మండల పరిధిలో ములగపూడి(2), గుమ్మరేగుల, పి.చామవరం, రౌతులపూడి, శృంగవరం, శంఖవరం మండల పరిధిలో శంఖవరం (2), తొండంగి మం డలం బెండపూడి, గద్దిపేట, కృష్ణాపురం, కె.కోదాడ, తుని మండలం టి.వెంకటాపురం, మర్లపాడు, డి.పోలవరం, హెచ్.కొత్తూరు, ఎస్.అన్నవరం (కమలపాడు), ఏలేశ్వరం మండలంలో ఏలేశ్వరం (3), ఎర్రవరం, సిరిపురం గ్రామాల్లో ఖాళీ ఉన్నట్లు తెలిపారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

11మంది అరెస్టు

పిఠాపురం రూరల్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): పిఠాపురం మండలం నవ ఖండ్రవాడ గ్రామంలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై ఎస్ఐ మణికుమార్ ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేశారు. 11మందిని అరెస్టు చేసి రూ.21,700 నగదు స్వాధీనం చేసుకున్నారు. వీరిని కోర్టులో హాజరు పరచనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

హైందవ శంఖారావానికి వేలాదిగా తరలిరావాలి



ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు రవిశంకర్ పట్నాయక్

పిఠాపురం, జనవరి 1(ఆంధ్రజ్యోతి): విశ్వ హిందూపరిషత్, ఇతర హిందూ సంఘాల ఆధ్వర్యంలో విజయవాడలో ఈనెల5న నిర్వహించే హైందవ శంఖారావానికి వేలాదిగా తరలిరావాలని వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు రవిశంకర్ పట్నాయక్ కోరారు. శంఖారావంపై గ్రామాల్లో అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన ప్రచార రథాన్ని పిఠాపురంలోని సూర్యరాయ విద్యానంద గ్రంథాలయం వద్ద బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రారంభించారు. శంఖారావానికి తరలివచ్చే వారికి రవాణా సౌకర్యాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మన ఆలయాలను, సంప్రదాయాలు, సంస్కృతిని సంరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని చెప్పారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ కార్యవాహ పెమ్మరాజు సత్యరామచంద్రరావు, వివిధ సంఘాల నాయకులు కొండేపూడి శంకరరావు, గోవిందు, కంబాల నాగేశ్వరరావు, సింహాద్రి, ఈగల త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

రహదారులను కప్పేసిన పొగ మంచు




గొల్లప్రోలు టోల్‌ప్లాజా వద్ద పొగమంచు, పిఠాపురం-గొల్లప్రోలు మధ్య పంటపొలాల వద్ద పొగమంచు

పిఠాపురం/గొల్లప్రోలు, జనవరి 1(ఆంధ్రజ్యోతి): రహదారులు, పంట పొలాలను పొగమంచు కప్పేసింది. పగటి పూట ఎండ కాస్తున్నా సాయంత్రం అయ్యేసరికి చలి ప్రభావం అధికంగా ఉంటోంది. బుధవారం ఉదయం 10గంటల వరకూ పొగమంచు ప్రభావం ఉండగా, సాయంత్రం 4గంటలకే మళ్లీ చలి ప్రారంభమయింది. పిఠాపురం, గొల్లప్రోలు బైపాస్‌రోడ్లుతో పాటు పట్టణాల్లో ప్రధాన రహదారులు, పిఠాపురం-చేబ్రోలు మధ్య గల 216వ జాతీయ రహదారి, పంటపొలాలు మీదుగా పొగమంచు వ్యాపించింది. బుధవారం తెల్లవారుజాము సమయంలో పొగమంచు దట్టంగా కురవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. వాహనాల డ్రైవర్లకు రహదారి కనిపించక రోడ్డు పక్కన వాహనాలను నిలిపివేశారు.

విద్యార్థుల ప్రతిభకు విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు దోహదం



బహుమతులు అందిస్తున్న దృశ్యం

సామర్లకోట, జనవరి 1(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు ఎంతగానో దోహదపడతాయని వివేకానంద విద్యా సంస్థల చైర్మన్ సీహెచ్.వెంకటేశ్వరరావు, సంచాలకురాలు బీఎస్ సరోజిని అన్నారు. మంగళవారం సామర్లకోట మండల స్థాయి సైన్స్ ఫెయిర్ ప్రదర్శన ఏర్పాటు చేశారు. వివేకానంద విద్యా సంస్థకు చెందిన పలువురు విద్యార్థులు ప్రతిభ కనబర్చి బహుమతులు కైవసం చేసుకున్నట్లు వారు తెలిపారు. బహుమతులు అందుకున్న వారిలో సీహెచ్.శ్రీజ, ఎస్.సుదీప, సీహెచ్.శ్రీనివాసరావు, సీహెచ్.రిషిక వై.రిషిక, ఏ.శరణ్యసాయి, ఏ.శైలజలు మొత్తం అయిదు స్థానాల్లో మొదటి మూడు స్థానాలు కైవసం చేసుకున్నారని చెప్పారు. ఈసందర్భంగా పాఠశాల ఆవరణలో బుధవారం సాయంత్రం జరిగిన సభలో విజేతలను అభినందించారు. కార్యక్రమంలో సీహెచ్.శైలూష తదితర ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లితండ్రులు పాల్గొన్నారు.



వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

సర్పవరం జంక్షన్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): స్థానిక రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ కార్యాలయంలో బుధవారం పి.జనార్ధనరావు,శ్రీకళ దంపతుల వివాహ దినోత్సవం పురస్కరించుకుని వృద్ధులకు దుప్పట్లను పంపిణీ చేశారు. శీతాకాలంలో చలి నుంచి ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు వృద్ధులకు దుప్పట్లు అందించిన జనార్ధనరావు,శ్రీకళ దంపతులను రిటైర్డు లైబ్రేరియన్ చింతపల్లి సుబ్బారావు, అడబాల రత్నప్రసాదరావు అభినందించారు. గొడారిగుంటలో అడబాల ట్రస్ట్ అధ్యక్షుడు రత్నప్రసాదరావు ఆధ్వర్యంలో 2025 క్యాలెండర్‌ని ఎమ్మెల్యే పంతం నానాజీ ఆవిష్కరించారు.

7లోగా అభ్యంతరాలు తెలపాలి

ప్రత్తిపాడు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు షెడ్యూల్డు కులాల సర్వే నివేదికలపై ఈ నెల 7వ తేదీలోగా అభ్యంతరాలు తెలియజేయాలని ప్రత్తిపాడు తహసీల్దారు ఎం.సూర్యప్రభ కోరారు. తుది జాబితా 17న ప్రచురిస్తామని చెప్పారు. నూతన సంవత్సరం సందర్భంగా వీసీసీ సభ్యుడు ధర్నాలకోట శ్రీను తహసీల్దార్‌కు బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు..

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక


ఎమ్మెల్యే శిరీషదేవికి పుష్పగుచ్ఛాలు ఇచ్చి శుభాకాంక్షలు తెలుపుతున్న టీడీపీ నాయకులు

'అభివృద్ధిలో పురోగతి సాధించాలి'

రంపచోడవరం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ ప్రజలు నూతన సంవత్సరంలో అభివృద్ధిలో పురోగతి సాధించాలని ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి అన్నారు. బుధవారం ఆమె ఆర్‌అండ్‌బీ శాఖ కార్యాలయ ప్రాంగణంలో కేక్ కట్ చేశారు. వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు బొకేలు ఇచ్చి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు మఠం విజయభాస్కర్, మాజీ ఎమ్మెల్యే చిన్నం బాబూరమేష్, అడబాల బాపిరాజు, వైనిరంజనీదేవి, అనంతమోహన్, సలాది బాపిరాజు, సూర్యనారాయణరాజు, పం డా చెల్లన్నదొర, పల్లాల వెంకటరమణారెడ్డి, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గిరిజనులు సుఖసంతోషాలు, మంచి ఆయు రారోగ్యాలతో అభివృద్ధి సాధించాలని ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం ఆకాంక్షించారు. ఆయన కు వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పుష్పగుచ్ఛాలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఏపీవో(జీ) డీఎస్పీ రమణ, డిప్యూటీ డైరెక్టర్లు విజయశాంతి, షరీఫ్, జీసీసీ డీఎం జి.పార్వతీశ్వరరావు, ఏరియా ఆసుపత్రి ఆర్ఎం వెంకటఇం దిర, సూపరింటెండెంట్ శేషారెడ్డి, పీహెచ్‌వో కె. చిట్టిబాబు, ఈఈలు ఐ.శ్రీనివాసరావు, సుబ్బయ్య, తహసీల్దార్లు కరక సత్యనారాయణ, సీహెచ్ శ్రీని వాసరావు, పి.రామకృష్ణ, బాలాజీ, పీఏవో రాం బాబు, ఎంపీడీవో సుండం శ్రీనివాస్‌దొర, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


ఐటీడీఏ పీవో సింహాచలానికి బొకేలు ఇచ్చి శుభాకాంక్షలు తెలుపుతున్న ఉద్యోగులు


మోతుగూడెంలో...


దేవీపట్నం ఇందుకూరు-1 ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో

నూతన సంవత్సర వేడుకలు

మోతుగూడెం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): లోయర్ సీలేరులో ఏపీ జెన్‌కో ఉద్యోగస్తులు నూతన సంవత్సర వేడుకలు జరుపుకున్నారు. చీఫ్ ఇంజనీరు వాసుదేవరావును ఉద్యోగులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం డీఏవీ పాఠశాల హెచ్‌ఎం మల్లెల రఘురాం, ఉపాధ్యాయులను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. గ్రామస్తులకు సర్పంచ్ ఆకేటి సీత, టీడీపీ ఎంపీటీసీ వేగి నాగేశ్వరరావు శుభాకాంక్షలు చెప్పారు.

దేవీపట్నం (ఆంధ్రజ్యోతి): దేవీపట్నం సర్పంచ్ కుంజం రాజామణి, తెలుగు యువత మండల అధ్యక్షుడ లంక హరిబాబు ఆధ్వర్యంలో ఇందుకూరు-1 ఏనుగులగూడెం ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. డీజే పాటలు, టపాసులు మోతల మధ్య కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ప్రజలందరికీ సర్పంచ్ రాజామణి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. త్రిమూర్తులు, పెద్ద సుబ్బారావు, చిన్న సుబ్బారావు, విష్ణు, పోసిబాబు, అంజిరెడ్డి, యువకులు పాల్గొన్నారు.

కూనవరం (ఆంధ్రజ్యోతి): మండలంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రజలు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఆలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

వీఆర్ పురం (ఆంధ్రజ్యోతి): ఇళ్ల ముందు మహిళలు నూతన సంవత్సరానికి స్వాగ తం పలుకుతూ రంగులతో అందమైన ముగ్గులు వేశారు. ప్రధాన కూడళ్లలో కేక్‌లు కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఒకరికొకరు నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పుకుంటూ ఆనందంగా గడిపారు.

ఎటపాక (ఆంధ్రజ్యోతి): మంగళవారంఅర్ధరాత్రి 12 గంటలు దాటిన తర్వాత బాణసంచా కాల్చి కేక్‌లు కట్ చేశారు. ఒకరొకికరు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకున్నారు. 2024కు వీడ్కోలు పలికి 2025కు స్వాగతం పలికారు. చర్చిల్లో క్రైస్తవులు కేక్‌లు కట్ చేసి ప్రత్యేక ప్రార్థనలు జరిపారు.

మలేరియాను పూర్తిగా నిర్మూలించాలి: ఐటీడీఏ పీవో అపూర్వభరత్

చింతూరు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): చింతూరు ఏజన్సీలో మలేరియా వ్యాప్తిని పూర్తిగా నిర్మూలించాలని ఐటీడీఏ పీవో అపూర్వభరత్ పేర్కొన్నారు. బుధవారం చింతూరులో జాతీయ కీటక జనిత నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన పీవో పలు సూచనలిచ్చారు. 2027 నాటికి చింతూరు ఏజన్సీలో మలేరియాను పూరిగా నిర్మూలించే దిశగా ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. ఫ్రైడే డ్రైడే లాంటి పారిశుధ్య కార్యక్రమాలను క్రమం తప్పకుండా నిర్వహిస్తే మలేరియా, డెంగ్యూలను నిర్మూలించే అవకాశం ఉందన్నారు. అందుకు అవసరమయ్యే సహకారాన్ని ఐటీడీఏ అందిస్తుందన్నారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ పుల్లయ్య, డాక్టర్ సుబ్రహ్మణ్యేశ్వరి, డీఎంవో (పాడేరు) ఎం.తులసి, చింతూరు డివిజన్ వైద్యాధికారులు పాల్గొన్నారు.



గండిపోశమ్మ అమ్మవారి ఆలయ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి దుర్గేష్, కూనవరంలో యూటీఎఫ్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఆ సంఘ నాయకులు

క్యాలెండర్ల ఆవిష్కరణ

దేవీపట్నం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొందూరు గ్రామంలో వెలసిన శ్రీగండిపోశమ్మ అమ్మవారి 2025 సంవత్సర క్యాలెండర్‌ను మంత్రి కందుల దుర్గేష్ బుధవారం ఆవిష్కరించారు. ఆలయ గ్రేడ్-1 ఈవో గండి వెంకటలక్ష్మీకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

కూనవరం (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరం సందర్భంగా యూటీఎఫ్ క్యాలెండర్‌ను నాయకుడు పాయం కన్నారావు ఆవిష్కరించారు. నాయకుడు ఎ.నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



గ్లోరీ మినిస్ట్రీస్ చర్చిలో క్రిస్మస్ వేడుకలు

వై.రామవరం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): గ్లోరీ మినిస్ట్రీస్ చర్చిలో బుధవారం క్రిస్మస్, నూతన సంవత్సర వేడుకలు జరిపారు. దైవ జనురాలు సీహెచ్ మరియమ్మ ఆధ్వర్యంలో ప్రా ర్థనలు నిర్వహించారు. వృద్ధులు, వితంతువులకు చీరలు పంపిణీ చేశారు. పాస్టర్ గుడ్ల అనంతయ్య, సంఘ పెద్దలు గుడ్ల వెంకటేశ్వర్లు, పుడిగి లక్ష్మణరావు, గొర్లె శాంతరాజు, పిల్లి సత్యనారాయణ, రిటైర్డు ఉపాధ్యాయులు కుటుంబరావు, నహోమ్ పాల్గొన్నారు.



బీజేపీ మండల అధ్యక్షుడిగా రాజబాబు

అడ్డతీగల, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): బీజేపీ మండల అధ్యక్షుడిగా కురసం రాజబాబు ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు జిల్లా ప్రధాన కార్యదర్శి చోళ్ల బొజ్జిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సాంగి రాజారావు, జిల్లా కార్యదర్శి స్వప్నకుమారి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు


జగ్గంపేట మండలం ఇర్రిపాకలో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూకి శుభాకాంక్షలు తెలుపుతున్న టీడీపీ నాయకులు


ప్రత్తిపాడులో ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభకి శుభాకాంక్షలు తెలుపుతున్న టీడీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు


తునిలో టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు, ఎమ్మెల్యే యనమల దివ్యలకు శుభాకాంక్షలు చెప్తున్న దృశ్యం

న్యూ ఇయర్ సందడి

జగ్గంపేట రూరల్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరం సందర్భంగా జగ్గంపేట మండలం ఇర్రిపాకలో జగ్గంపేట ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యుడు జ్యోతుల నెహ్రూకు పలువురు ప్రముఖులు శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, జిల్లా పంచాయతీ అధికారి వి.రవికుమార్, డీఈవో పిల్లి రమేష్, డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి, పెద్దాపురం ఆర్డీవో కె.రమణి, పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు, పెద్దాపురం, కోరుకొండ సబ్ డివిజన్ల ముఖ్య అధికారులు, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని రాజకీయ ప్రముఖులు, జగ్గంపేట నియోజకవర్గంలోని అన్ని శాఖల అధికారులు, జిల్లాలోని వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, టీడీపీ జిల్లా నాయకులు ఎమ్మెల్యేకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, అడపా తాతాజీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

జగ్గంపేట (ఆంధ్రజ్యోతి): స్థానిక స్వామి వివేకానంద విద్యా సంస్థల ఆవరణలో ఏర్పాటు చేసిన వేదికపై జగ్గంపేట జడ్పీటీసీ ఒమ్మి బిందుమాధవి రఘురామ్‌కి పలువురు శుభాకాంక్షలు తెలిపారు. రఘురామ్ దంపతులతో విద్యార్థులు, టీచర్లు కేక్‌లు కట్ చేయించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఎస్వీఎస్ అప్పలరాజు, టీడీపీ జగ్గంపేట మండల శాఖ అధ్యక్షుడు మారిశెట్టి భద్రంపాపారత్నం, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త కొండబాబు, జేవియర్ గ్రూపు అధినేత, టీడీపీ యువనేత జీను మణిబాబు, జగ్గంపేట నియోజకవర్గ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు వేములకొండ జోగారావు, టీడీపీ జగ్గంపేట టౌన్ అధ్యక్షుడు పాండ్రంకి రాంబాబు, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు అడబాల వెంకటేశ్వరరావు నివాసాలకు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, అధికారులు, ప్రజాప్రతినిధులు చేరుకుని నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ సహకారంతో నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధిపథంలో నడిపించాలని ఆకాంక్షించారు.

ప్రత్తిపాడు (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడులో న్యూ ఇయర్ వేడుకలు నిర్వహించారు. ఎమ్మెల్యే సత్యప్రభ హైస్కూల్ రోడ్డు కూడలి వద్ద వున్న తన భర్త రాజా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సభా వేదికపై కుటుంబ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో కేక్ కట్ చేశారు. నియోజకవర్గంలోని వివిధ శాఖల అధికారులు, అన్నవరం దేవస్థానం వ్రత పురోహితులు, పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఎమ్మెల్యేను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

తుని రూరల్ (ఆంధ్రజ్యోతి): టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, ఎమ్మెల్సీ యనమల రామకృష్ణుడు, తుని ఎమ్మెల్యే యనమల దివ్యలకు జిల్లా నలుమూలల నుంచి వందలాదిగా తరలి వచ్చిన కార్యకర్తలు, ఉద్యోగులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. యనమల నివాసం వద్ద రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. రూరల్ పోలీసులు వాహనాలను వేరే రూట్‌కి మళ్లించి ట్రాఫిక్ రద్దీని చక్కదిద్దారు.

ఏలేశ్వరం (ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగంపర్తిలో జనసేన ప్రత్తిపాడు ఇన్‌చార్జి వరుపుల తమ్మయ్యబాబు, పెద్దనాపల్లిలో ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, ఏలేశ్వరంలో నగర పంచాయతీ చైర్‌పర్సన్ అలమండ సత్యవతి, కౌన్సిలర్లు బొదిరెడ్డి గోపి, మూది నారాయణస్వామి, అలమండ చలమయ్య, సామంతుల సూర్యకుమార్ నివాసాల వద్దకు అధికారులు, అభిమానులు భారీగా తరలివచ్చారు. పూలమాలలు, బొకేలతో వారికి శుభాకాంక్షలు తెలిపారు.

గండేపల్లి (ఆంధ్రజ్యోతి): టీడీపీ గండేపల్లి మండల శాఖ అధ్యక్షుడు పోతుల మోహనరావు, యువ నాయకుడు జాస్తి వసంత్, తెలగరెడ్డి భద్రరావు, క్లస్టర్ ఇన్‌చార్జి బొల్లంరెడ్డి రామకృష్ణ, వల్లభశెట్టి కోటి తదితరులు జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూని కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

కిర్లంపూడి (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామచంద్రపురంలో జనసేన జగ్గంపేట ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ స్వగృహానికి ప్రజలు భారీగా తరలివచ్చి శుభాకంక్షలు తెలియజేశారు. కిర్లంపూడి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ తోట రవి కేక్ కట్ చేశారు. టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు చదరం చంటిబాబు, జగపతినగరం సర్పంచ్ గుడాల శ్రీలత రాంబాబు, టీడీపీ జిల్లా నాయకుడు తూము కుమార్, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి కుర్ల చినబాబు, కాళ్ల వెంకటేష్, ఎంపీటీసీ ఆళ్ల నానాజీ నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొన్నారు. మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం, వైసీపీ సమన్వయకర్త గిరిబాబుకు ఆ పార్టీ నాయకులు, అభిమానులు శుభాకాంక్షలు తెలిపారు.

కోటనందూరు (ఆంధ్రజ్యోతి): కేఏ మల్లవరంలో టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు గాడి రాజుబాబు, మాజీ ఎంపీపీ చిరంజీవిరాజు, మాజీ జడ్పీటీసీ పెంటకోట భాస్కర సత్యనారాయణ నివాసాలు నాయకులు, కార్యకర్తలు, ఉద్యోగులతో సందడిగా కనిపించాయి. తుని తరలివెళ్లి యనమల రామకృష్ణుడు, యనమల దివ్యలకు శుభాకాంక్షలు తెలిపారు. అంకంరెడ్డి రమేష్, షేక్ నవాబ్, జానీ, మేరపురెడ్డి జోగిబాబు, వెలగా వెంకట కృష్ణారావు, పోతల సూరిబాబు, బైలపూడి శ్రీరామమూర్తి, గెడ్డం కొండయ్యనాయుడు, పెనుముచ్చు నాగేశ్వరరావు, బంటుపల్లి వెంకటేశ్వరరావు, వాసం నాగేశ్వరరావు యర్ర చినసత్యనారాయణ, చిందకాయల రవికుమార్, లగుడు సత్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

తొండంగి (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సర వేడుకలను మండలంలో ఘనంగా నిర్వహించారు. ఇళ్ల ముందు నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ రంగవల్లులు తీర్చిదిద్దారు.


కిర్లంపూడిలో....

చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఎంఈవోలు షేక్ బాబ్జీ, ఎ.సుబ్బిరెడ్డిలను కలిసి ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలిపారు. రెవెన్యూ సిబ్బంది, పంచాయితీరాజ్ సిబ్బంది అధికా రులను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. యువకులు కేరింతలతో హుషారుగా గడిపారు. మరికొంత మంది తీరంలో సందడి చేశారు.

రౌతులపూడి (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపేందుకు ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభరాజా నివాసానికి రౌతులపూడి మండలంలోని గ్రామాల నుంచి నాయకులు, కార్యకర్తలు ద్విచక్ర వాహనాలు, బస్సులు, ఆటోలపై భారీగా తరలివెళ్లారు. మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం, వైసీపీ ప్రత్తిపాడు ఇన్‌చార్జి ముద్రగడ గిరి నివాసానికి నాయకులు, కార్యకర్తలు వెళ్లారు. రౌతులపూడి, మూలగపూడిల్లో టీడీపీ మండల అధ్యక్షుడు తమరాల సత్యనారాయణ, ఎంపీపీ గంటిమళ్ల రాజ్యలక్ష్మి, మాజీ ఎంపీపీ ఇటంశెట్టి సూర్యభాస్కరరావు నివాసానికి అధికారులు, కార్యకర్తలు తరలివెళ్లి శుభాకాంక్షలు తెలిపారు.

రంగవల్లులతో కళకళ

ప్రత్తిపాడు, జనవరి1 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరం ప్రారంభం సందర్భంగా మండలంలోని గ్రామాలు బుధవారం రంగవల్లులతో కళకళలాడాయి. కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ గృహాలుముందు రంగవల్లులు రంగులతో అందంగా వేశారు. దీంతో కొత్త సంవత్సరం ప్రారంభంరోజు నివాస గృహాలు ముగ్గులతో కళకళలాడాయి.



కనకదుర్గమ్మ అమ్మవారికి మహాకుంభాభిషేకం

కిర్లంపూడి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తామరాడ గ్రామంలో వేలానదీ తీరాన వేంచేసియున్న కనకదుర్గమ్మ ఆలయంలో బుధవారం మహా కుంభాభిషేకాన్ని ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహించారు. మహిళలు కలశలు చేతపట్టి పురవీధుల్లో తిరుగుతూ ఆలయానికి చేరుకుని అమ్మవారికి మహా కుంభాభిషేకం జరిపారు. అనంతరం భారీ అన్నదానం చేశారు.

నేడు ప్రత్తిపాడులో కలెక్టర్ పర్యటన

ప్రత్తిపాడు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ షాన్ మోహన్ షాగిల్ గురువారం ప్రత్తిపాడులో పర్యటించనున్నారని ఎంపీడీవో ఎంవీఆర్ కుమార్‌బాబు తెలిపారు. గురువారం ఉదయం 10.30గంటలకు ప్రత్తిపాడులోని వైద్య విధాన పరిషత్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను, అనంతరం మండలంలోని వేములపాలెం గ్రామాన్ని సందర్శిస్తారు. ఆ తర్వాత పెద్దిపాలెం పీహెచ్‌సీని, అక్కడి నుంచి ఉత్తరకంచి, లంపకలోవ గ్రామాల మీదుగా ప్రత్తిపాడు మండల పరిషత్, తహసీల్దారు కార్యాలయాలను పరిశీలిస్తారు. చివరిగా రాచపల్లి పీహెచ్‌సీని కూడాని సందర్శించి కాకినాడ వెళ్తారని చెప్పారు.


పీఆర్వో కృష్ణారావుకు విరాళం అందజేస్తున్న దాత శైలేంద్రనాథ్

సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం

అన్నవరం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి బుధవారం సామర్లకోట మండలం వేట్లపాలేనికి చెందిన ఎ.శైలేంద్రనాథ్-పద్మావతి దంపతులు లక్ష రూపాయలు విరాళంగా సమర్పించారు. ఈ మొత్తాన్ని పీఆర్వో కృష్ణారావుకు అందించగా దాతను ఆయన అభినందించి ప్రత్యేక దర్శనం చేయించి స్వామివారి ప్రసాదం అందజేశారు.


కరపత్రాలు పంచుతున్న బీజేపీ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్

హైందవ శంఖారావానికి తరలిరండి

ఏలేశ్వరం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో ఈ నెల 5న జరిగే హైందవ శంఖారావానికి భారీగా తరలిరావాలని బీజేపీ జిల్లా కార్యదర్శి కొల్లా శ్రీనివాస్ చిన్నింపేటలో ఇంటింటికీ కరపత్రాలు పంచారు. ప్రచారంలో దాడి అప్పాజీ, మళ్ల రాణి, యల్లపు వరలక్ష్మి, అజయ్, కుమారి తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దారు కార్యాలయానికి ఇన్వర్టర్ వితరణ

ఎటపాక, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): ఎటపాక తహసీల్దారు కార్యాలయానికి జమాల్ ఖాన్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో బుధవారం ఇన్వర్టర్‌ను వితరణ చేశారు. ట్రస్టు చైర్మన్ జమాల్‌ఖాన్ రూ.20వేలు విలువైన ఇన్వర్టర్‌ను తహసీల్దారు సుబ్బారావుకు అందజేశారు. రెవెన్యూ సిబ్బంది, జేకేసీ ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా సురేష్ జన్మదినం

శంఖవరం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) టీడీపీ మాజీ అధికార ప్రతినిధి పర్వత సురేష్ జన్మదిన వేడుకలు శంఖవరం ఆయన నివాసంలో ఘనంగా జరిగాయి. కార్యకర్తలు భారీ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.